రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:30 (శనివారం సాయంత్రం)
సహర్ 4:53 (ఆదివారం ఉదయం)

# ఉగాది నుంచి సన్నబియ్యం



- పంపిణీకి సిద్ధం చేసిన అధికారులు
- జిల్లాలో 2,76,908 రేషన్‌కార్డులు
- సన్నబియ్యం లబ్ధిదారులు 8,04,968 మంది
- నెలకు 5,135.60 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అవసరం
- జిల్లాలో ఏడు నెలలకు సరిపడా నిల్వలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం నుంచి ప్రజలకు సన్నబియ్యం సరఫరా చేసేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఈ ఉగాది నుంచి అమలు చేస్తున్నది. రేషన్‌కార్డుల్లో పేర్లు నమోదై ఉన్న ప్రతి ఒక్కరికీ ఆరు కిలోల చొప్పున బియ్యం సరఫరా చేయనున్నారు. జిల్లాకు ప్రతినెలా 5,135.60 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అవసరం కాగా ఏడు నెలలకు సరిపడా బియ్యం నిల్వలను జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంచింది. జిల్లాలో పౌరసరఫరాలశాఖ 566 చౌకధరల దుకాణాల ద్వారా 2,76,908 కుటుంబాలకు రేషన్‌కార్డుల ద్వారా బియ్యం, నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తున్నారు. ఈ కుటుంబాలలో 8,04,968 మంది నెలనెలా బియ్యం పొందుతున్నారు. జిల్లాలో 2,61,164 ఆహారభద్రతా కార్డులు ఉండగా ఆయా కుటుంబాల్లోని 7,64,122 మంది సభ్యులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున 45,847 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేస్తున్నారు. 15,730 అంత్యోదయ ఆహారభద్రతా కార్డుల ద్వారా ఒక్కో కుటుంబానికి 35 కిలోల చొప్పున 35 అన్నపూర్ణకార్డుల ద్వారా 35 మందికి ఒక్కో కుటుంబానికి 10 కిలోల చొప్పున నెలనెలా ఉచితంగా బియ్యం సరఫరా చేస్తున్నారు. వీరందరికీ నెలనెలా 5,135.60 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం అవుతుంది.

**● 35వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం నిల్వలు**

జిల్లాలో ప్రస్తుతం 35వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం నిల్వలు ఉన్నాయి. ఏడు నెలలకు సరిపడా బియ్యం అందుబాటులో ఉండగా కస్టమ్ మిల్లింగ్ నుంచి రావలసిన బియ్యంతోపాటు యాసంగి సీజన్ కొనుగోలు చేసే ధాన్యంతో సమకూర్చుకునే బియ్యం కూడా త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ప్రజా పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా చూసేందుకు ఈ-పాస్ మిషన్ ద్వారా ఆన్‌లైన్‌కు అనుసంధానం చేశారు. వీటి ద్వారానే బియ్యం

(మిగతా 8వ పేజీలో)

## 'శుక్రవారం సభ'లో అన్ని సమస్యలకు పరిష్కారం

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి


చిన్నారికి పౌష్టికాహారాన్ని అందిస్తున్న కలెక్టర్

రామడుగు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహిళల సమస్యల పరిష్కా రానికి శుక్రవారం నిర్వహించే సభ వేదికగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో రామడుగు మండలం కొక్కెరకుంటలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లా డుతూ మహిళలు తమ సమస్యలు ఏవైనా శుక్రవారం సభలో విన్నవించుకోవచ్చని, సభానంతరం దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో మహిళలందరికీ సుమారు 50 రకాల పరీక్షలు ఉచితం గా నిర్వహిస్తున్నామని, వీటిని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా చంటి పిల్లల కు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సబిత, డీఎంహెచ్‌వో వెంకటరమణ , ఎంపీడీవో ఆర్ రాజేశ్వరి, మండల ప్రత్యేక అధికారి అనిల్, ఎంపీవో శ్రావణ్ కుమార్, సీడీపీవో నిర్మలరాణి, సెక్రటరీ విజయలక్ష్మీ, వైద్యాధి కారి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలం ఇప్పించండి

- మంత్రి పొన్నంకు మహిళా సంఘాల వినతి

చిగురుమామిడి,మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం ప్రభుత్వ భూమి కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు చట్ల మొగిళి, గ్రామ మహిళా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం హైదారాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సర్వే నెంబర్ 685లో ప్రభుత్వ భూమి కొనుగోలు కేంద్రం కోసం కేటాయించాలని కోరారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. స్థలం ఇప్పించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామైఖ్య సంఘం అధ్యక్షులు దేశిని జ్యోతి, సొల్లు రజిత, షైలగాని సూజాత, చట్ల మానస, మామిడి రమ, మాజీ ఎంపీటీసీ మిట్టపల్లి మల్లేశం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మిట్టపల్లి ఆదర్శ్, కొంకట భిక్షపతి, చట్ల వెంకటరాజం, రైతు సంఘం అధ్యక్షుడు కత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళా సంఘాల సభ్యులు

# ప్లాట్ల క్రమబద్ధీకరణకు పాట్లు

- గందరగోళంగా 'ఎల్ఆర్ఎస్'
- 25శాతం రాయితీతో ముందుకు వస్తున్న జనం
- ఎన్‌వోసీలు, ఎల్-1, ఎల్-2 పెండింగ్‌తో ఇబ్బందులు
- మరోవైపు సర్వర్ డౌన్ సమస్యలు
- మార్చి 31 వరకే రుసుములో రాయితీ




కరీంనగర్ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థలాల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)కు అవకాశమివ్వడమే కాకుండా రుసుములో 25శాతం రాయితీ ప్రకటించింది. అయితే 2020లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకొని వేయి రూపాయలు చెల్లించిన వారికే ఈ రాయితీ వర్తిస్తుందని ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ఎల్ఆర్ఎస్‌కు అవకాశ మిచ్చిన ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ రుసుములో 25శాతం రాయితీ పొందేందుకు మార్చి 31,2025 గడువు తేదీగా ప్రకటించింది. మార్చి 31వ తేదీలోగా ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్లను, స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని, లేనిపక్షంలో స్థలాలను అమ్ముకున్నా వాటిని రిజిస్ట్రేషన్లు చేయరని, ఆయా ప్లాట్లు, స్థలాల్లో భవన నిర్మాణా లకు అనుమతి ఇవ్వమని, ఇదే చివరి అవకాశమని విస్తృత ప్రచారం చేశారు. దీనితో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల్లో కొంత కదలికవచ్చింది. దరఖాస్తులను ఎల్-1,ఎల్-2,ఎల్-3 స్టేజీల్లో ఇరిగేషన్, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల్లో క్లియరెన్సు ఇచ్చిన తర్వాతనే ఎల్ఆర్ఎస్ చేస్తామని ప్రకటించారు. దీనితో చాలా మంది ఎల్ఆర్ఎస్ ద్వారా రెగ్యులరైజ్ చేసుకునేందుకు సిద్ధపడ్డారు. గతంలో ఎల్ఆర్ఎస్ కోసం వేయి రూపాయల రుసుము చెల్లించిన వారిలో చాలా మంది రాయితీ అవకాశాన్ని సద్విని యోగం చేసుకునేందుకు ముందుకువచ్చి డాక్యు మెంట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగా చాలా మందికి ఎల్-1,ఎల్-2 స్టేజీల్లో పెండింగ్ అని, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ నుంచి నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్లను తీసుకు రావాలంటూ సూచిస్తున్నారు. దీంతో వారు ఆయా శాఖల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కరీంనగర్‌లోనే వేయికి పైగా ఒక్క రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఎన్‌వోసీ కోసం దరఖాస్తులు రాగా, ఇతర శాఖల్లోకి వెళ్లి తెచ్చేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరికి ఎన్‌వోసీల్లో డాక్యుమెంట్‌లోని సర్వేనెంబర్ కోర్టు కేసుల్లో ఉంటే ప్లాట్‌పై ఎలాంటి కేసులు లేకున్నా మొత్తం ఆ సర్వేనెంబర్‌లోని అన్ని ప్లాట్లపై కేసు ఉన్నట్లు రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు ఎన్‌వోసీ ఇస్తున్నారు. దీనితో ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించినా కూడా రెగ్యులరైజ్ అయింతుందో లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. డాక్యుమెంట్లతో పాటు ఎన్‌వోసీలను పట్టుకొని నగరపాలక సంస్థకు వెళ్లి తాము ఎంత చార్జీలు చెల్లించాలో చెప్పాలని అధికారులను కోరగా సైట్ ఓపెన్ కావడం లేదంటూ, ఆన్‌లైన్‌లో వచ్చిన మొత్తం చెల్లించాలంటూ సందిగ్ధంగా సమాధానా లిస్తున్నారు. దీనితో చాలా మంది ప్లాట్లను క్రమ బద్ధీకరించుకునేందుకు అనేక పాట్లు పడుతున్నారు. ఎల్ఆర్ఎస్ చేసుకోకుండానే వెనుదిరిగి పోతున్నారు. మరోవైపు ఈ నెల 31తో గడువు ముగియడంతో 30న తెలుగు సంవత్సరాది ఉగాది, 31న ముస్లింల పర్వదినం రంజాన్ ఉండడంతో పండుగ బిజీలో ఉండి డాక్యుమెంట్ షార్ట్‌ఫాల్స్, ఎన్‌వోసీల కోసం తిరిగే సమయం లేక ఎల్ఆర్ఎస్‌ను విరమించుకుంటూ గడువు పొడగిస్తే చూద్దామనే భావనవ్యక్తం చేస్తు న్నారు. ఇన్ని సమస్యలతో గడువు రెండు రోజుల్లో ముగియనున్నందున ప్రభుత్వం మరోసారి రాయితీతో ఎల్ఆర్ఎస్ గడువు పొడిగిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

## దివ్యాంగులకు వసతులు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్ : దివ్యాంగులకు జారీ చేయనున్న యూడీఐడీ కార్డుల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, వారికి వసతులు కల్పించాలని జిల్లా అనుపత్రి వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శుక్రవారం జిల్లా జనరల్ ఆసుపత్రి లోని యూడీఐడీ కార్డుల వైద్యపరీక్షల విభాగాన్ని పరిశీలించారు. దివ్యాంగులకు ర్యాంపు, టాయి లెట్స్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. అవసర మైన మిషనరీ టెక్నీషియన్ల కోసం ప్రభు త్వానికి ప్రతిపాదలను పంపామని తెలిపారు. ఇదివరకే సద రం సర్టిఫికెట్ ఉన్నవారు యూడీఐడీ కార్డుకు దరఖాస్తు చేయాల్సిన అవరం లేదన్నారు. వైద్య పరీక్షలకు హాజరు కావలసిన అవసరం కూడా లేదన్నారు. సదరం ఉండి కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు మాత్ర మే ఆన్‌లైన్ లేదా మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్టిఫి కెట్ జారీ కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూప రింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ నవీన, డీఆర్‌డీవో శ్రీధర్ తదితరులు పాల్గొ న్నారు.


వేసవి కాలం.. వాహనాలు జాగ్రత్త 7
● ముందు జాగ్రత్తలతోనే ప్రమాదాల నియంత్రణ

చారిత్రక ప్రాంతానికి రవాణా సౌకర్యం 6


## తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలి

- మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



కరీంనగర్ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా వేసవి యాక్షన్‌ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె నగరంలోని పలు మంచినీటి రిజర్వాయర్లను సందర్శించి, నీటి సరఫరా తీరును పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులు, రిజర్వాయర్ల సిబ్బందితో మంచినీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విలీన గ్రామాలతో సహా నగరంలో ప్రజలకు ఎక్కడ కూడా తాగునీటి కష్టాలు రాకుండా అన్ని చర్యలను తీసుకోవాలని అన్నారు. సమయానికి అనుగుణంగా తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. నల్లానీటిని విడుదల చేసిన సమయంలో రిజర్వాయర్ల సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, డీఈ, ఏఈ స్థాయి అధికారులు కూడా పర్యవేక్షణ చేసి నీరు వృధా కాకుండా చూడటంతో పాటు ఏమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించా లని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నట్లు ఫిర్యాదులు వచ్చా యని, అలాంటి వాటిని తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పైపులైన్ల లీకేజీలు, వాల్స్ మరమ్మ తులుంటే వెంటనే చేయించాలని, నీటి శుద్ధి కేంద్రంలో రా వాటర్ సేకరణలో, సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, స్టాండ్‌బై మోటార్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎల్ఎండీలో నీటి మట్టం తగ్గినందున ఆన్‌లైన్ బూస్టర్లను నడిపించి రా వాటర్ తీసుకొని శుద్ధి చేసిన రిజర్వాయర్ల షెడ్యూల్ ప్రకారంగా నీటిని విడుదల చేయాలన్నారు. నీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఈ సమా వేశంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈలు రొడ్డ యాదగిరి, సంజీవ్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్


కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాల్గొన్న కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

- రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

సుభాష్‌నగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అన్నాడి రాజారెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని, రైతు రుణమాఫీ, ఫసల్ బీమా యోజన అమలు, రైతు భరోసా, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు వరంగల్ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ అనేక హామీలు, వాగ్దానాలు చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన అన్ని హామీలు, వాగ్దానాల్లో కోతపెడుతూ రైతాంగాన్ని గోసపెడుతున్నారని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ రైతాంగాన్ని మోసం చేసినట్టు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అంతకంటే దారు ణంగా మోసం చేస్తుంద న్నారు. రాష్ట్రవ్యాప్తంగా 64 లక్షల మంది రైతులు పంట రుణాలు తీసుకుంటే కేవలం 25 లక్షల మందికి కూడా రుణమాఫీ చేయకుండా, 70 శాతం మందికి ఎగ్గొట్టారని ఆరోపించారు. ఎంత మంది రైతులకు రుణమాఫీ చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా విషయంలో కూడా మోసం చేశార న్నారు. ఎంతమంది రైతు కూలీలకు సహాయాన్ని అందించారని ప్రశ్నించారు. సన్నవడ్లకే బోనస్ ఇచ్చారన్నారు. పంటలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాలు, వడగండ్ల కారణంగా పంట నష్టపోయిన రైతులు ప్రభుత్వా నికి కనిపంచడం లేదా అని ప్రశ్నించారు. రైతు లకు కేంద్రం ఇచ్చే సహాయం రైతులకు అంద కుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆరోపించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడంలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం క్వింటాలు ధాన్యానికి రూ. 2,320 కనీస మద్దతు ధర నిర్ణయించి రైతులకు అండగా నిలుస్తుందన్నారు. కొనుగోలు అయ్యే ప్రతి పైసా కేంద్రమే భరిస్తుందని తెలిపారు. రైతుల సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా బీజేపీ అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, యాదగిరి, కర్ర సంజీవరెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్య క్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్ వై సునీల్‌రావు, డి శంకర్, రాష్ట్ర నాయకులు బాస సత్యనారాయణ, గుగ్గిల్లపు రమేశ్, ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, కన్నెబోయిన ఓదెలు, బోయినిపల్లి ప్రవీణ్‌రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకటరెడ్డి, ఎర్ర వెల్లి సంపత్‌రావు, బొంతల కళ్యాణ్‌చంద్ర, బింగి కరుణాకర్, అలువెలి సమ్మిరెడ్డి, చొప్పరి జయశ్రీ, మడుగురి సమ్మిరెడ్డి, దుర్శెట్టి సంపత్, కటకం లోకేష్, ఎన్నం ప్రకాష్, బల్బీర్‌సింగ్, ఫుప్పాల రఘు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 90శాతం వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోండి

- మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి

కరీంనగర్ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నుల బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్ర వారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇందిరాగార్డెన్ ఆస్తిపన్ను బకాయిలను డిప్యూటీ కమిషనర్‌ను కలిసి చెల్లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చితో ఆర్థిక సంవత్సరం ముగుస్తుందని, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా వడ్డీ రాయితీతో ఆస్తిపన్ను బకాయిలన్నిటినీ చెల్లించాలని కోరారు. ఇందుకోసం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

## అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

ధర్మపురి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన గోల్ల సత్తయ్య(55) వెన్నునొప్పి భరించలేక గురువారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపినవివరాల ప్రకారం.. సత్తయ్య ఐదు సంవత్సరాల నుంచి తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి11 గంటల సమయంలో ఇంటిముందు ఉన్న 25కిలోవాట్ల విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వైరును పట్టుకున్నాడు. రెండు చేతులకు తీవ్రమైన గాయాలు కాగా సత్తయ్యను కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. మృతుడు సత్తయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనం పట్టివేత

గన్నేరువరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని గుండ్లపల్లి వద్ద గన్నేరువరం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. తిమ్మాపూర్ మండలం రేణికుంట నుంచి సిద్దిపేటకు టీఎస్28టి7996గల వాహనంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న చిన్నకోడూరు మండలం రామంచ గ్రామానికి చెందిన డ్రైవర్ పల్లెచిన్న, వాహన యజమానిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.

## ఘాట్ రోడ్డు నిర్మాణం
# పూర్తయ్యేదెన్నడో..?

- అమలుకు నోచుకోని పర్యాటక కేంద్రం హామీ
- అభివృద్ధికి దూరంగా మామిడిపల్లి సీతారామ ఆలయం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పనులు ప్రారంభించి వదిలేసిన ఘాట్‌రోడ్డు, మామిడిపల్లి గుట్టపై వెలిసిన శ్రీసీతారామచంద్రస్వామి

కోనరావుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిపల్లి సీతారాములస్వామి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వహయాంలో మరో భద్రాచలం ఆలయంగా మార్చి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్న మాట కలగానే మిగిలిపోయింది. ఘాట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు జరగడం లేదు. దీంతో మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**● ఆలయానికి ప్రత్యేక గుర్తింపు..**

కోనరావుపేట మండలం మామిడిపల్లి గుట్టపై వెలిసిన సీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉండడమే కాకుండా భక్తులు కొంగు బంగారంగా కొలుస్తారు. ప్రతి సంవత్సరం మాఘ అమావాస్య జాతర, సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరుగుతాయి. వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. వేములవాడ ఆలయ ఆధీనంలో మామిడిపల్లి సీతారాముల ఆలయం కొనసాగుతోంది. గత ప్రభుత్వ పాలనలో అప్పటి ఎమ్మెల్యే రమేష్‌బాబు మరో భద్రాచలం ఆలయంగా తీర్చిదిద్దడంతో పాటు పర్యాటక కేంద్రంగా మారుస్తామని హామీ ఇచ్చారు. సీతమ్మ తల్లి పర్ణశాల నిర్మాణం చేపడుతామన్న హామీ అమలుకు నోచుకోలేదు. మూడు సంవత్సరాల క్రితం కోటి 19లక్షల రూపాయలతో ఘాట్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. సదరు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. ఆలయ అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించకపోవడంతో ఎలాంటి పనులు జరగడం లేదు. ఇటీవల మాఘమాసం సందర్భంగా ఎమ్మెల్యే సూచన మేరకు రెండు రోజుల పాటు పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ తిరిగి అర్ధంతరంగా వదిలేశారు. ఇప్పటికైనా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించి పనులు పూర్తయ్యేలా, ఆలయ అభివృద్ధి కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**పర్యాటక కేంద్రంగా మార్చాలి..**



**- కృష్ణహరి, ఆలయ అర్చకులు**

గత ప్రభుత్వ పాలనలో మా మిడిపల్లి సీతారామ స్వామి ఆల యాన్ని మరో భద్రాచలం ఆల యంగా మారుస్తారని హామీ ఇ చ్చారు. పర్యాటక కేంద్రంగా మా రితే ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికైనా ప్రారంభించిన ఘాట్ రోడ్డు నైనా పూర్తిచేస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

## రేషన్ బియ్యం పట్టివేత



వాహనంలో రేషన్ బియ్యం

గన్నేరువరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ చుట్టుపక్కల గ్రామాల నుంచి సేకరించిన పీడీఎస్ బియ్యం సుమారు 17 క్వింటాళ్లను వ్యాన్‌లో గుండ్లపల్లి మీదుగా సిద్దిపేటకు తరలిస్తుండగా శుక్రవారం గుండ్లపల్లిస్టేజి వద్ద గన్నేరువరం పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ బొమ్మ స్వామిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.

## బాలికను వేధించిన కేసులో రెండు సంవత్సరాల జైలుశిక్ష

జగిత్యాల క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడి, అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడికి రెండు సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.25వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కోడిమ్యాల పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన మహమ్మద్ అంకూస్ అనే 20సంవత్సరాల యువకుడు 2019 సంవత్సరంలో అదే మండలంలోని ఓగ్రామానికి చెందిన బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై శివకృష్ణ కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు సాగర్, కిరణ్, రాజు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి అంకూస్‌కు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## దొంగను పట్టుకున్న రాజన్న ఆలయ సిబ్బంది

వేములవాడ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ, మున్సిపల్ ప్రాంతాల్లోని విద్యుత్ వైర్‌ను దొంగిలిస్తున్న కోరుట్ల ప్రాంతానికిచెందిన శ్రీనివాస్ అనేవ్యక్తిని ఆలయ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. తరచూ దేవస్థానానికి చెందిన జనరేటర్ సమీపంలో, ఆలయపరిసరాల్లోని విద్యుత్‌వైర్‌ను దొంగిలించి షాపులో అమ్ముతున్నట్లు సిబ్బంది గమనించారు. శుక్ర వారం కూడా వైర్‌ను దొంగిలిస్తుండగా శ్రీనివాస్‌ను పట్టుకొని చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగించారు.

## స్వగ్రామం చేరిన గల్ఫ్ మృతదేహం

గన్నేరువరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్‌కు చెందిన లింగంపల్లి మొండయ్య బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లగా అక్కడే ఆయన అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలని ఇటీవల కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు కుటుంబసభ్యులు, గ్రామస్థులు వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన తక్షణమే స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించే ప్రయత్నం చేయగా శుక్రవారం మృతదేహం స్వగ్రామం చేరింది. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సొల్లు అజయ్‌వర్మ, న్యాయవాది లింగంపల్లి నాగరాజు కోరారు.

## అంతుచిక్కని వ్యాధితో కోళ్లు మృతి

గంగాధర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపూర్ కోళ్లఫారంలో అంతుచిక్కని వ్యాధితో బాయిలర్ కోళ్లు మృతిచెందాయి. రెండురోజులుగా కోళ్లు నీరసంగా ఉంటున్నాయి. గురువారం రాత్రి బాగానే ఉన్న కోళ్లు శుక్రవారం ఉదయం మృతిచెందాయి. మృతి చెందిన కోళ్లను పశువైద్యాధికారి పరిశీలించారు. మృతిచెందిన కోళ్లను పూడ్చి పెట్టారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

కోరుట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని శుక్రవారం ఉదయం సీసీఎస్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద రూ. 22,920 నగదు స్వాధీనం చేసుకొని ఆరుగురిని అరెస్టుచేసి వారినికోరుట్ల పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. వారివద్ద ఆరుసెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## సినీ ఫక్కీలో చోరీ

- బ్యాంకు నుంచి డ్రాచేసిన రూ. 1.50 లక్షలు అపహరణ



పోలీసులు విడుదల చేసి అనుమానితుల ఫొటో

కోరుట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో శుక్రవారం పట్టపగలు సినీఫక్కీలో చోరీజరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన చింతకుంట శ్రీహరి అనే రైతు అతని స్నేహితుడితో కలిసి కోరుట్ల పట్టణంలోని ఎస్‌బీఐ ప్రధానబ్యాంకుకు డబ్బులు డ్రా చేయడానికి ద్విచక్రవాహనంపై వచ్చారు. బ్యాంకులోకి వెళ్లి రూ. 1,50,000 నగదు డ్రా చేసుకొని ద్విచక్ర వాహనంలో పెట్టుకున్నాడు. అప్పటికే వీరిని గమనిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు శ్రీహరి వాహనం తీస్తున్న సమయంలో మీ జేబునుంచి 100రూపాయలు కింద పడిపోయాయని ఓ వ్యక్తి చూపించాడు. వాహనంపై ఉన్న శ్రీహరి కిందికి దిగి వంద రూపాయల నోటును తీసుకునే క్రమంలో వెనుకాల ఉన్న మరో గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంలో ఉన్న రూ. 1,50,000 నగదును అపహరించి వారు తెచ్చుకున్న ద్విచక్ర వాహనంపై పరారీ అయ్యారు. శ్రీహరి తేరుకొని చూసేసరికి బ్యాగులో ఉన్న నగదు కనపడకపోవడంతో బోరున విలపించాడు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బ్యాంకుతో పాటు పట్టణంలో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. అనుమానితుల సీసీ పుటేజీలను పోలీసులు విడుదల చేశారు. బాధితుడు శ్రీహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.

## నమిలికొండలో దొంగతనం

కొడిమ్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన బల్లాడి లక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 80వేల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు, నగదును ఎత్తుకుపోయినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. బల్లాడి లక్ష్మి ఈ నెల 26న కరీంనగర్‌కు పని నిమిత్తం వెళ్లారు. శుక్రవారం ఇంటికి వచ్చి చూసేసరికి దొంగతనం జరిగింది. ఎవరులేని సమయంలో ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకు పోయారని బాధితురాలు పిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్టు తెలిపారు.

## అస్వస్థతకు గురైన ఉపాధి కూలీ

శంకరపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని చింతగుట్ట గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పనిచేస్తూ గణపతి అనే వ్యక్తి అస్వస్థతకు గురై కిందపడిపోయాడు. వెంటనే పనిచేస్తున్న తోటికూలీలు ఆటోలో తాడికల్ వరకు అక్కడినుంచి 108లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

## 20క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సిరిసిల్ల క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం బల్యాలనగర్‌లోని ఓ పౌల్ట్రీ ఫాం వద్ద అక్రమంగా నిల్వచేసిన 20క్వింటాళ్ల రేషన్ బియ్యంను శుక్రవారం పట్టుకున్నామని టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. ఈ రేషన్ బియ్యంను నిల్వచేసిన కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట గ్రామానికి చెందిన బుర్ర అంజయ్యను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

## గంజాయి అమ్ముతున్న వ్యక్తిపై కేసు

కొడిమ్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ రైల్వేగేట్ దగ్గర 150గంజాయి అమ్ముతున్న మండలంలో పూడూర్ గ్రామానికిచెందిన ఈదురి అనోక్ పై శుక్రవారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. రైల్వేగేట్‌దగ్గర అనోక్ గంజాయి అమ్ముతున్నాడన్న పక్కా సమాచారంతో సిబ్బందితో కలిసివెళ్లి అతనిని పట్టుకున్నట్లు తెలిపారు.

నిందితుడిని విచారించగా బీహార్‌కు చెందిన షరీఫ్‌అనేవ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి నట్లు ఒప్పుకున్నాడన్నారు. ఈ మేరకు అనోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## కొదురుపాకలో చోరీ..

బోయినపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొదురుపాక గ్రామంలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ఐదు తులాల బంగారు ఆభరణాలతోపాటు 24తులాల వెండిని ఎత్తుకెళ్లినట్లు ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు. గ్రామానికిచెందిన సట్టాజలజ ఇంటికి గడియపెట్టి తాళం వేయకుండా అంగన్‌వాడీపాఠశాలకు వెళ్లింది. తిరిగి వచ్చేసరికి ఇంటికి తలుపుతెరిచి ఉండడంతో అనుమానంతో బంగారు ఆభరణాలను పరిశీలించగా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## చికిత్స పొందుతూ సింగరేణి ఉద్యోగి మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణానికి చెందిన ఎండి. హైమద్ (51) చికిత్స పొందుతూ మృతి చెందాడు. బసంత్‌నగర్ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 26న పెద్దపల్లి పట్టణానికి చెందిన గంగిడి శ్రీనివాస్ రెడ్డి, హైమద్ ద్విచక్రవాహనంపై సింగరేణి లో విధులకు వెళ్తుండగా రాఘవపూర్ వద్ద పెద్దపల్లికి వస్తున్న ఆర్టీసీ బస్ అతివేగంతో ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. హైమద్ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించగా శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య జూలేక బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్ నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

## చారిత్రక ప్రాంతానికి
# రవాణా సౌకర్యం

- మానేరు నది పాత రోడ్డుపై నూతన వంతెన నిర్మాణం
- కరీంనగర్- ఎలగందల్ మధ్య తగ్గనున్న దూరం

భగత్‌నగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-ఎలగందల్ మధ్య నూతనంగా నిర్మిస్తున్న వంతెనతో చారిత్రక ప్రాంతానికి రవాణా సౌకర్యం మెరుగుపడనున్నది. కొత్తపల్లి మండలంలోని చింతకుంట, ఎలగందల్, కమాన్‌పూర్, బావుపేట, ఖాజీపూర్ గ్రామాలతో పాటు, సిరిసిల్ల వేములవాడకు వెళ్లే ప్రయాణికులకు దూరం తగ్గనున్నది. ఎల్ఎండి నిర్మాణంతో పాత రోడ్డు మానేరులో మునిగి పోవడంతో దశాబ్దాలకు పైగా ఎలగందల్ గ్రామం కరీంనగర్ జిల్లా కేంద్రానికి దూరమైపోయింది. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెంతనే ఉన్న ఎలగందల్ గ్రామానికి చేరుకోవాలంటే పది కిలోమీటర్లకు పైగా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం కరీంనగర్-ఎలగందల్ గ్రామాల మధ్య మానేరు నదిపై నూతనంగా గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి పునాదులు వేశారు. బ్రిడ్జి నిర్మాణం శరవేగంగా పూర్తి కావస్తుండడంతోఎలగందల్ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కరీంనగర్-సిరిసిల్ల వెళ్లాలంటే ఈ ప్రాంతంలో పాత రోడ్డు ఉండేది. ఎల్ఎండీ నిర్మాణంతో పాత రోడ్డు మానేరు నీటిలో మునిగి పోయింది. బ్యాక్ వాటర్‌తో పాటు, మానేరు నది నీరు పూర్తిగా ఈ చింతకుంట, ఎలగందల్ గ్రామాలకు ఆనుకుని రావడంతో ఆ రోడ్డు పూర్తిగా కనుమరుగైంది.



ఎలగందల్-కరీంనగర్ మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి

**● పర్యాటకులకు సౌకర్యం**

ఎలగందల్ గ్రామం ఒకప్పుడు జిల్లా కేంద్రంగా ఉండేది. గ్రామంలో ప్రాచీన కళా సంపద, కోట బురుజులు, చారిత్రాక ప్రదేశం కావడంతో బ్రిడ్జి నిర్మాణంతో పర్యాటకుల తాకిడి కూడా పెరగనున్నది. బ్రిడ్జి నిర్మాణం చేయాలని ఈ ప్రాంత వాసులు ఏళ్లగా కోరుతున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి ఈ ప్రాంత వాసులకు అందుబాటులోకి తీసుకురావా లని కోరుతున్నారు.

**బ్రిడ్జి నిర్మాణంతో తీరనున్న ప్రజల వెతలు**



**- మంద రమేష్, మాజీ ఎంపిటీసీ, ఎలగందల్**

కరీంనగర్-ఎలగందల్ గ్రామాల మధ్య పాత రోడ్డు ప్రాంతంలో నూతనంగా బ్రిడ్జి నిర్మాణం చేపడుతుండడంతో ప్రజల వెతలు తీరనున్నాయి. కరీంనగర్‌కు ఎలగందల్ గ్రామం దూరం తక్కువైనా బ్రిడ్జి లేక పోవడంతో చుట్టు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నది. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న గ్రామానికి సరైన రవాణా లేక వెనుకబాటుకు గురైంది. బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

# ప్రేమ.. పరువు... హత్య...

- కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్న యువతీ, యువకుడు
- పలుమార్లు పంచాయితీ
- కులాంతర వివాహం చేసుకుంటే పరువు పోతుందని భావించిన తండ్రి
- అదును చూసి యువకుడి హతం
- ముప్పిరితోట గ్రామంలో విషాదం
- శాంతిభద్రతల దృష్ట్యా గ్రామంలో పోలీస్ పికెట్



విలపిస్తున్న సాయి కుమార్ తల్లి

పెద్దపల్లి/ఎలిగేడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కూతురిని ప్రేమిస్తున్నాడనే అక్కసుతో అమ్మాయి తండ్రి యువకుడి పుట్టిన రోజే పథకంప్రకారం గొడ్డలితో నరికి చంపిన ఘటన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో చోటు చేసుకున్నది. పూరేళ్ల పరుశరాములుగౌడ్-జ్యోత్స్న దంపతుల కుమారుడు సాయి కుమార్(20) రెండేళ్లక్రితం ఇంటర్మీడియెట్‌లో చేరి మధ్యలోనే ఆపేశాడు. అదే గ్రామానికి చెందిన వేరే కులానికి చెందిన అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ఆ అమ్మాయి డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. వీరి ప్రేమవ్యవహారం తెలుసుకున్న అమ్మాయి తండ్రి సాయికుమార్‌ను మందలించాడు. అయినప్పటికీ వారు కలుస్తుండడంతో ఈ విషయమై గ్రామంలో పంచాయితీ జరిగింది. వారు ఒకరికొకరు ఇష్టపడడంతో వివాహం చేయాలని సలహా ఇచ్చారు. ఇరు కుటుంబాలు అందుకు అంగీకరించారు. కానీ కూతురు ప్రేమ వివాహం చేసుకోవడం తండ్రికి ఇష్టం లేదు. మరోవైపు వేరే కులానికి చెందిన వ్యక్తికి ఇచ్చి పెండ్లి చేస్తే కులంలో, గ్రామంలో పరువు పోతుందని బంధువులు పేర్కొన్నారు. దీంతో ఏమి చేయాలో పాలుపోని అమ్మాయి తండ్రి యువకుడిని హతమార్చేందుకు ప్లాన్ వేశాడు.

అమ్మాయిని ప్రేమించిన పాపానికి కసాయి చేతిలో కొడుకు గొడ్డలివేటుకు గురై మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. సాయికుమార్ పుట్టిన రోజు గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన ముత్యం సది(సదయ్య) అనే వ్యక్తి గొడ్డలితో దాడిచేసి విచక్షణరహితంగా నరికి చంపాడు. అదే గ్రామానికి చెందిన యువతి, సాయికుమార్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారని, పెళ్లి చేసుకుంటామని తెలిపారని మృతుడి తల్లిదండ్రులు విలపించారు. కొడుకుపై కక్షపెంచుకొని అదనుచూసి చంపాడని బోరున విలపించారు. గతంలో రెండుసార్లు హత్యాయత్నం చేశారని ఆవిషయం కులంలో చర్చించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని మృతుడి తండ్రి పర్శరాములు గౌడ్ పేర్కొన్నారు. తమ కుమారుడిని హత్యచేసిన నిందుతున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు విలపించిన తీరు గ్రామస్థులను కంటతడి పెట్టించింది. గతంలో కూతురిని కోల్పోయామని ఉన్న ఒక్కగానొక్క కొడుకు హత్యకు గురయ్యాడని, తమకు దిక్కెవరంటూ రోదించారు. సంఘటన స్థలాన్ని డీసీపీ కరుణాకర్, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సైలు సనత్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్, స్వామి, నరేష్‌కుమార్, శ్రావణ్‌కుమార్‌లు పరిశీలించారు. నిందుతుడు ముత్యం సదయ్యపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బారెడ్డి తెలిపారు.

**గ్రామంలో పోలీస్ పికెట్**

జిల్లాలోనే సంచలనం సృష్టించిన పరువుహత్య ఘటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గురువారం రాత్రి పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. ఇరు కుటుంబాల సామాజికవర్గాలు వేర్వేరు కావడంతో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ ఉన్నతాధికా రులు ముందస్తు చర్యలు చేపట్టి నిఘాను కట్టుదిట్టం చేశారు. జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బలగాలు రప్పించి జూలపల్లి, ధర్మారం, సుల్తానాబాద్, బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ల ఎస్సైల ఆధ్వర్యంలో గ్రామంలో ప్రధాన కూడళ్లు, నిందితుడు, మృతుడి ఇంటి వద్ద పోలీస్ పహరా ఏర్పాటుచేశారు. పోలీసు పహారా మధ్య శుక్రవారం సాయంత్రం సాయికుమార్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

**పోలీస్ బందోబస్తు మధ్య పోస్ట్‌మార్టం**

సుల్తానాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో హత్యకు గురైన పూరెళ్ల సాయికుమార్ మృతదేహానికి శుక్రవారం సుల్తానాబాద్ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించారు. సంఘటన జరిగిన గురువారం రాత్రి నుంచి మృతుడి బంధువులు పెద్దఎత్తున ఆస్పత్రికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఆస్పత్రి వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తు మధ్య సాయికుమార్ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్ పోలీస్ అధికారులు బందోబస్తు పర్యవేక్షించారు. మధ్యాహ్నం లోగా పోస్ట్‌మార్టం ప్రక్రియ పూర్తి కావడంతో బందోబస్తు మధ్య మృతదేహాన్ని ముప్పిరితోటకు తరలించారు. మృతుడి బంధువులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ కు సన్నిహితులు కావడంతో పలువురు నాయకులు ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు.

## కొబ్బరిముక్కల సేకరణకు టెండర్ ఖరారు

మల్యాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో కొబ్బరిముక్కలు పోగు చేసుకునే టెండర్ ఎట్టకేలకు ఖరారు అయింది. శుక్రవారం దేవస్థానం అధికారులు ఆన్‌లైన్, సీల్డ్, బహిరంగ వేలం నిర్వహించగా ఈ వేలంలో హెచ్చు పాటగా రూ.91,16,666 నిలువడంతో టెండర్ ఖరారు చేశారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్ ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనిదినాలు 200కు పెంచాలి

కరీంనగర్ అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పని దినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని టీపీసీసీ ఎస్సీ సెల్ సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య ఒక ప్రకటనలో కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరల దృష్ట్యా కూలీల వేతనం కూడా రూ.300 నుంచి రూ.600 పెంచేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతాల అనుసంధానం పేరిట 7.6 కోట్ల మందికూలీల జాబ్‌కార్డులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొలగించిందని ఆరోపించారు. 10 ఏళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించాయని తెలిపారు.

## పూడూర్‌లో రోడ్డు ప్రమాదం

● వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు

కొడిమ్యాల, మార్చి28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ గ్రామ శివారులో కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ ఆవుల సంపత్‌కు గాయాలయ్యాయి. ఎస్సై ఎస్ సందీప్ తెలిపిన వివరాల మేరకు కరీంనగర్ వైపు నుంచి వస్తున్న వ్యాన్‌ను డ్రైవర్ అతివేగంగా నడుపుతూ పూడూర్ గ్రామ శివారులో రెండు కార్లను, ఒక లారీని ఢీకొట్టినట్లు తెలిపారు. వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.




## ముందు జాగ్రత్తలతోనే ప్రమాదాల నియంత్రణ

కరీంనగర్ క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. పగటి వేళ బయట అడుగుపెట్టాలంటే జనాలు భయపడుతున్నారు. భానుడి ప్రతాపంతో మనుషులే కాదు వాహనాలకూ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. హైదరాబాద్‌లో బుధవారం ఒక పోలీస్ వాహనంలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. ప్రస్తుత వేసవి కాలంలో వాహనాల్లో ప్రయాణించాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యధిక ఉష్ణోగ్రతలతో వాహనాలకు ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని గుర్తించాలి. వాహనాల్లో ఇంజిన్, విద్యుత్ సరఫరా చేసే వైర్లలో సమస్యలు తలెత్తి మంటలు చెలరేగే అవకాశం ఉంది. వేగంగా వెళ్తున్న సమయంలో ఇతర వాహనాలను ఢీకొన్న సమయంలో పెట్రోల్, డీజిల్ లీకేజీ అయి మంటలు అంటుకునే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో నడుస్తున్న వాహనం, నిలిపి ఉన్న వాహనాల నుంచే అకస్మాత్తుగా మంటలు వస్తాయి. వాహనాల్లోని వైరింగ్‌లో నాణ్యత లోపం, ఇంజన్ వేడెక్కడం, ఆయిల్, డీజిల్, పెట్రోల్, గ్యాస్ లీకేజీ కారణంగా మంటలు అంటుకునే ప్రమాదముంది. వేసవిలో పాత వాహనాలు ఎక్కువగా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవాలి. వేసవిలో వాహనాల ఇంజన్లు వేడెక్కుతుంటాయి. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే ప్రమాదాల బారినపడకుండా కాపాడుకోవచ్చు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ (ఈవీ) ద్విచక్ర వాహనాలు, కార్లు వేల సంఖ్యలో నడుస్తున్నాయి. వేసవిలో ఈవీ వాహనాలు త్వరగా వేడెక్కి మంటలు అంటుకునే అవకాశాలుంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఈవీ వాహనాలకు చార్జింగ్ చేసే సమయంలో, ఎక్కువ దూరం వెళుతున్న సందర్భంలో జాగ్రత్తగా ఉండాలంటున్నారు.

### వైరింగ్ నాణ్యత లోపంతో షార్ట్ సర్క్యూట్ జరుగుతుంది

- కానిగంటి రమేష్, కార్ మెకానిక్ అసోసియేషన్ కరీంనగర్ అధ్యక్షుడు



బైక్, కారు, జీపు, ఇతర వాహనాల్లో నాణ్యత లేని వైర్లను ఉపయోగించడంతో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా వాహనాల తయారీ సమయంలో దాని సామర్థ్యాన్ని తట్టుకునే విధంగా కంపెనీ వైర్ ఫిట్టింగ్ ఉంటుంది. వాహనాల్లో వైరింగ్ దెబ్బతిన్న విషయం గుర్తించకపోవడం, వైర్లు ఒకదానికి మరొకటి కలవడంతో మంటలు అంటుకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాల్లో పెట్రోల్, డీజిల్ గ్యాస్ లీకేజీలు గమనించకుంటే ఎండలకు ఇంజన్ వేడెక్కి హఠాత్తుగా మంటలు వ్యాపిస్తాయి. ఎలక్ట్రిక్ వాహనాల యజమానులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి.

### ● మంటలు వచ్చేందుకు కారణాలు

- వాహనాల్లో వాడుతున్న ఇంధనాలన్నీ ఇంజన్ ఆయిల్, పెట్రోల్, డీజిల్, గ్యాస్ మండే స్వభావం ఉన్నవి.
- వేసవిలో ఇంజన్ త్వరగా వేడెక్కుతుంది. దూర ప్రయాణంలో మధ్యలో కొంత



సమయం విరామం తీసుకోవాలి.
- ఇంధనాలు ఏమాత్రం లీకైనా వేడికి మంటలు వచ్చేందుకు అవకాశం ఉంటుంది.
- వాహనాల్లో తక్కువ నాణ్యత వైర్లు వాడటంతో కూడా స్పార్క్ వచ్చి మంటలు అంటుకునే ప్రమాదమున్నది.
- వాహనాల్లో ఫాగ్ లైట్స్, స్టీరియో, సౌండ్స్, సెల్‌ఫోన్ చార్జర్, ఇతర డెకోరేషన్ లైట్స్ వంటివి అదనంగా బిగించడంతో వైరింగ్‌పై లోడ్ పడి దెబ్బతింటున్నాయి.
- పాత వాహనాలకు గ్యాస్‌కిట్‌లను అమర్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే లీకేజీ కారణంగా మంటలు అంటుకుంటాయి.
- షోరూం ఎల్పీజీ వర్షన్‌లో వచ్చిన కార్లు కాకుండా పాత కార్లకు తక్కువ నాణ్యత కలిగిన గ్యాస్ కిట్లు అమర్చడంతో గ్యాస్ లీకేజీతో ప్రమాదాలు జరుగుతాయి.

### ● తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- ప్రతి కారును నిర్ణీత సమయలో సర్వీసింగ్ చేయించుకోవాలి.
- 10 వేల కిలోమీటర్లు తిరిగిన తర్వాత వాహనం ఇంజన్‌లో ఉండే ఆయిల్ ఫిల్టర్లను మార్చుకోవాలి.
- కారు నుంచి మంటలు వచ్చినప్పుడు దూరంగా ఉండాలి. అటువైపు ట్రాఫిక్ రాకుండా చూడాలి.
- వాహనంలో ఉన్నప్పుడు మంటలు, కాలుతున్న వాసన వస్తే వాహనాన్ని నిలిపివేసి తనిఖీ చేయాలి.
- మండే స్వభావం ఉన్న గ్యాస్ డబ్బాలు, ఇంధనాలు తీసుకెళ్లకుండా జాగ్రత్త వహించాలి.
- కారు ఇంజన్ కూలింగ్ కోసం కూలెంట్ వాటర్‌ను పోయాలి. ఇది ఇంజన్



వేడెక్కకుండా కాపాడుతుంది.
- తరచు ఇంజన్ ఉష్ణోగ్రతను తనిఖీ చేస్తుండాలి.
- గుర్తింపు పొందిన సెంటర్లలోనే వాహనాలను సర్వీసింగ్ చేయించాలి.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముత్తారం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన రొయ్యల రాజకుమార్(26) పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. రొయ్యల రాజకుమార్ ఓ దినపత్రికకు రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిస కాగా గ్రామానికి చెందిన ఒకరి వద్ద రూ.లక్ష అప్పుచేశాడు. అందులో రూ.50వేలు చెల్లించాడు. మద్యం మానేసి మిగతా అప్పుచెల్లించాలని తల్లి కొమురమ్మ రాజకుమార్‌ను మందలించింది. ఈనెల 17న మద్యంలో పురుగులమందు కలుపుకొని తాగి ఇంటికి వచ్చి తల్లికి తెలిపాడు. దీంతో హుటాహుటిన కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి అనంతరం వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

పెంచికలపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను శుక్రవారం ఉదయం ఎల్కపల్లి పెట్రోల్‌పంపు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూరుమండలం మర్తిడి గ్రామంనుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ సంతకు తరలిస్తున్న ఐదు ఎద్దులు, రెండు దున్నపోతులను తరలిస్తున్న వాహనాన్ని సమాచారం మేరకు పట్టుకున్నారు. పశువులను తరలిస్తున్న కరీంనగర్‌కు చెందిన జాఫర్, అహ్మద్ రఫీ, బెజ్జూరు మండలం కుకుడ గ్రామానికి చెందిన శ్రీశైలం అనే ముగ్గురిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

పెద్దపల్లిటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) పట్టణానికి చెందిన కొంతం శ్రావణ్ కమాన్ నుంచి జెండా చౌరస్తాకు బైక్‌పై వెళ్తుండగా మొబైల్ పడిపోయింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ ఎస్సై రవికాంత్‌కు అది దొరకగా ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. శ్రావణ్‌కు సెల్‌ఫోన్ అందజేశాడు.

## అగ్నిప్రమాదాలపై ఆర్టీసీ డిపోలో అవగాహన



ఆర్టీసీ డిపో-2లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వేసవిదృష్ట్యా అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా చేపట్టాల్సిన రక్షణచర్యలపై కరీంనగర్ అగ్నిమాపకశాఖ అధికారులు గురువారం ఆర్టీసీ కరీంనగర్-2 డిపోలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అగ్నిమాపకఅధికారి సుల్తాన్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం డిపోలో ఎలక్ట్రిక్ బస్సులతోపాటు ఇతర బస్సులున్నాయని, వేసవిలో ఇంజన్ వేడెక్కి మంటలు అంటుకునే ప్రమాదముందని అన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ బస్సులడ్రైవర్లు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అనంతరం ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన రక్షణచర్యలపై అగ్నిమాపకశాఖ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో ఏఈ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే గేటు వద్ద విరిగిన హైట్ గేజ్

● మరమ్మతు చేసిన అధికారులు



రైల్వే గేటు వద్ద విగిన హైట్ గేజ్

కరీంనగర్ రూరల్; మార్చి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రహదారిపై రైల్వే గేటు వద్ద భారీ చేసిన హైట్ గేజ్ విరగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం ఉదయం రెడ్ మిక్స్ వాహనం పైపు తాకడంతో విద్యుత్ లైన్ రక్షణ కోసం ఏర్పాటు చేసిన హైట్ గేజ్‌విరిగింది. వెంటనే సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, అధికారులు మరమ్మతు చేపట్టారు. మరమ్మతుచేసే సమయంలో ట్రాఫిక్‌జామ్‌తో అవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు గంటల తరువాత రాకపోకలు ప్రారంభమయ్యాయి.

## ఆర్టీసీ జోనల్ ఆస్పత్రి తనిఖీ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఈడీ ఖుస్రోషాఖాన్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ గిరిసింహారావు

భగత్‌నగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ జోనల్ ఆస్పత్రిని జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన వివిధ పరికరాలను పరిశీలించారు. అనంతరం వేసవిలోలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాన్ని ఆవిష్కరించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ బీవీ రావు, జోనల్ వర్క్ షాప్ మేనేజర్ సుగుణాకర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్.మధుసూదన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైస్‌మిల్లులలో సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీ

● 31675.47 క్వింటాళ్ల ధాన్యం నిల్వలో తేడా ● అధికారులతో యజమాని వాగ్వాదం



అధికారులతో వాగ్వాదం చేస్తున్న మిల్లు యజమాని

మంథని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరయ్యపల్లి శ్రీలక్ష్మి మాడ్రన్ రైస్‌మిల్లుకు అనుబంధంగా ఉన్న గంగాపురిలోని సత్యసాయి పారాబాయిల్డ్ రైస్‌మిల్లులో నిల్వలపై సివిల్ సప్లయి ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు శుక్రవారంతనిఖీ చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎఫ్‌సీఐ అధికారులు శ్రీలక్ష్మి పారాబాయిల్డ్, రైస్‌మిల్‌లో తనిఖీలు నిర్వహించారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన ధాన్యం, బియ్యంనిల్వ2023-24 సంవత్సరానికిగాను ఎఫ్‌సీఐకి సంబంధించిన ధాన్యం, బియ్యం నిల్వలపై అధికారులు తనిఖీలు చేశారు. గంగాపురిలోని శ్రీసత్యసాయి రైస్‌మిల్లులో తనిఖీ చేయగా 41,365.27 క్వింటాళ్ళ ధాన్యంకు గాను 9689.8 క్వింటాళ్ళు మాత్రమే లెక్కలోకి వచ్చాయి. మిగితా 31675.47 క్వింటాళ్ళ ధాన్యం స్వాహా అయినట్లు అధికారులు గుర్తించారు. తనిఖీ చేస్తున్న అధికారులతో మిల్లు యజమాని వొల్లాల సత్యనారాయణ వాగ్వాదానికి దిగాడు. తనిఖీల పై సివిల్ సప్లై టాస్కుఫోర్సు ఓఎస్‌డీ ప్రభాకర్, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ.. తనిఖీల్లో 31675.47 క్వింటాళ్ళ ధాన్యం తక్కువగా వచ్చినట్లు తెలిపారు. 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి 19,339 క్వింటాళ్ల ధాన్యం, బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించామని పెద్దపల్లి గోదాం మేనేజర్ వెంకటేష్‌సాగర్ తెలిపారు. నిల్వఉన్న బ్యాగ్‌లు మాత్రం వేరుగా ఉన్నట్లు గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. తనిఖీలపై రైస్‌మిల్లు యాజమాని సత్యనారాయణ మాట్లాడుతూ. మిల్లులో 2024 డిసెంబర్ 31 లోగా టెండర్ తీసుకున్న కాంట్రాక్టర్ ధాన్యం నిల్వలు తీసుకెళ్లాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయన్నారు. ధాన్యం తీసుకెళ్ళక పోవడం వాళ్ళ తప్పే అన్నారు. తనిఖీలో ఎలాంటి తేడాలు వచ్చిన హైకోర్టు ఉత్తర్వుల మేరకు డబ్బులు చెల్లించడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఎస్‌ఐ జంగయ్య, డీటీ సంతోష్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. రాజన్న ఆలయానికి శుక్రవారం భక్తులు తరలివచ్చి ఆలయకల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని తిరుగు ప్రయాణమయ్యారు.

**అగ్రహారం అంజన్న హుండీ లెక్కింపు..**

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన అగ్రహారం ఆంజనేయ స్వామి ఆలయ హుండీలను శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఓపెన్ ప్లేస్‌లో ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో మూడు నెలల హుండీలను విప్పి లెక్కించగా ఆలయ ఖజానాకు రూ. 2 లక్షల 3 వేల 292 నగదు ఆదాయ సమకూరినట్లు తెలిపారు. హుండీల లెక్కింపులో ఆలయ ఉద్యోగులు వంశీయ ధర్మకర్త మహేందర్, దేవాదాయ శాఖ పరిశీలకుడు రాజమౌళి, సత్యసాయిసేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

## జయంతి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

● అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

● కొండగట్టులో పరిశీలన



కొండపైన అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

మల్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలోజరిగే హనుమాన్ చిన్నజయంతి ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అధికారులకు సూచించారు. గతశనివారం జిల్లా కలెక్టర్, ఎస్పీ ఏర్పాట్లపై వివిధశాఖల అధికారులతో సమీక్షసమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సూచనలు ఇచ్చారు. ఇందులో భాగంగా శుక్రవారం అడిషనల్ కలెక్టర్ కొండగట్టులో పర్యటించారు. జయంతికి చేపట్టిన ఏర్పాట్లను దేవస్థానం అధికారులు, ఆలయఅర్చకులతో కలిసి కొండపైన ఆలయప్రాంతం, కోనేరు, వైజంక్షన్‌తదితరప్రాంతాలను పరిశీలించారు. కొండపైకివచ్చే భక్తులు, జయంతికి తరలివచ్చే దీక్ష స్వాములు ఎలాంటి ఇబ్బందులు పడకుండా త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అడిషనల్‌కలెక్టర్ వెంట ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, ఆర్డీవోమధుసూదన్, స్థానాచార్యులు కపీందర్, దేవస్థానం పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, తహసీల్దార్ మునీందర్, ఆర్ఐ తిరుపతి ఇతర అధికారులు ఉన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

మంథనిరూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టుపల్లి శివారు వద్ద అక్రమంగా తరలిస్తున్న 12క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన గొంతినర్సయ్య అనేవ్యక్తి ట్రాలీ ఆటోలో 12క్వింటాళ్ల బియ్యాన్నిఅక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్ నర్సయ్యను విచారించగా అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన వేముల మహేష్ చెప్పిన విధంగా మహారాష్ట్రలోని సిర్వోంచకు బియ్యాన్ని తరలిస్తున్నట్లు వెల్లడించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు.

## ఇంటర్‌లో హెచ్‌సీఈసీ కోర్సు ప్రవేశపెట్టాలి

● చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి



మాట్లాడుతున్న చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి

జగిత్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ ఆర్ట్స్‌విభాగంలో హెచ్‌సీఈసీ (చరిత్ర, కామర్స్, అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రం) కోర్సు ప్రవేశపెట్టాల్సిన అవసరముందని చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గర్ల్స్ జూనియర్ కళాశాల ఆవరణలో చరిత్ర జూనియర్ లెక్చరర్ల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పోతరవేణి తిరుపతి హాజరై మాట్లాడారు. 1976 సంవత్సరంలో ఇంటర్ విద్యలో ప్రవేశపెట్టిన సాంప్రదాయ కోర్సులే ఇప్పటికీ కొనసాగడం శోచనీయమన్నారు. ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా సాంప్రదాయ ఆర్ట్స్ కోర్సులైన హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులను కలిపి హెచ్‌సీఈసీతో నూతన కోర్సు రూపకల్పన చేసి ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లాచరిత్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొత్తూరి మహేశ్ కుమార్, చరిత్ర జూనియర్ లెక్చరర్లు సుదర్శన్, నరేశ్, రామ్ ప్రసాద్, దేవేందర్, నిర్మల, రజిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేపర్ బ్యాగుల తయారీపై విద్యార్థులకు శిక్షణ



పేపర్ బ్యాగుల తయారీపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు అంజయ్య

చందుర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పేపర్ బ్యాగుల తయారీపై శిక్షణ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణ.. ప్లాస్టిక్ వినియోగం నివారణలో భాగంగా వ్యర్థ పేపర్లను వినియోగించి పేపర్ బ్యాగులు, పేపర్ ఫైల్ తయారు చేయడంలో ఉపాధ్యయుడు మేడికాల అంజయ్య విద్యార్థులకు రెండు రోజులు శిక్షణ ఇచ్చాడు. విద్యార్థులు పలు రకాల బ్యాగులు, వివిధ రకాల పత్రాలు భద్రపరచుకోవడానికి పేపర్ ఫైళ్లను తయారు చేసి ప్రదర్శించారు. ప్లాస్టిక్ బదులుగా పేపర్ బ్యాగ్‌లు, పేపర్ ఫైల్ వాడుకోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు అంజయ్య మాట్లాడుతూ త్వరగా మట్టిలో కలిసిపోయే పేపర్ బ్యాగ్‌లు పర్యవరణానికి ఎంతో మేలు చేస్తాయని, వీటితయారీకి ఎలాంటి ఖర్చు ఉండదన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పిస్తే భావితరాలకు కలుష్య రహిత, ప్లాస్టిక్‌రహిత సమాజాన్ని అందించవచ్చన్నారు. ప్లాస్టిక్ వలన మనదేశంలో ప్రతి యేటా లక్షలాది మంది క్యాన్సర్ బారినపడుతున్నారని, ప్లాస్టిక్ వాడకం తగ్గించి పేపర్ బ్యాగ్‌లు,జూట్,బట్టసంచులను వాడాలని పిలుపునిచ్చాడు.

ఈ సందర్భంగా శిక్షణఅందించిన అంజయ్యను ప్రధానోపాధ్యాయులతోపాటు పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, రాజు, ఉపాధ్యాయులు జావీద్, మహేశ్, శ్రీనివాస్, పద్మ, నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ సమస్యలను పరిష్కరించండి



వివరాలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ అర్జీదారులకు తలెత్తుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ అధికారులు, ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం ఆమె మున్సిపల్ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఎల్ఆర్ ఎస్ దరఖాస్తుల పరిశీలన, క్రమబద్ధీకరణ ప్రక్రియను పరిశీలించారు. అర్జీదారులకు ఇబ్బంది కలుగకుండా మరో కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కల్పించిన రుసుములో 25 శాతం రాయితీ అవకాశాన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ సైట్ విషయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే ఆందోళన చెందవద్దని, అధికారులకు సహకరించి దరఖాస్తులను క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వేణు, టౌన్‌ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళిక లేకుండా ఎల్ఎండీ నీటి విడుదల

కరీంనగర్ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): లోయర్ మానేరు డ్యాం నుంచి ప్రణాళిక లేకుండా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారని మాజీ మేయర్, బీజేపీ నేత యాదగిరి సునీల్‌రావు అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన చేయకుండా దిగువకు నీటిని వదులుతున్నారన్నారు. రోజు విడిచి రోజు నల్లా నీరు సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించారని, ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే వేసవి ముగిసే వరకు తాగునీటి సరఫరా ఎలా చేస్తారని, ప్రణాళిక ఏమిటో చెప్పాలని అధికారులు, అధికార పార్టీ నేతలను ప్రశ్నించారు. తాగునీటిపై దృష్టిపెట్టకుండా మిడ్‌మానేరు నుంచి 2,500 క్యూసెక్కుల నీరు వస్తే దిగువకు 5,600 క్యూ సెక్కులు వదులుతున్నారని, మరోవారం రోజులపాటు ఇదే విధంగా దిగువకు ఎల్ఎండీ నుంచి నీరు విడుదల చేయనున్నట్లు చెబుతున్నారని, అదే జరిగితే ఎల్ఎండీలో నీటి నిలువలు 3 టీఎంసీలకు పడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటి అవసరాలకు, మిషన్ భగీరథకు ఎల్ఎండీలో కనీసం 11 టీఎంసీల నీటి నిలువల ఉండాలనే జీవో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మేయర్, బీజేపీ నేత యాదగిరి సునీల్‌రావు

ఇప్పటికే ఎల్ఎండీలో నీటి నిలువలు తగ్గడంతో నీటి రంగు మారిందని, సరిగా శుద్ధి చేయకుంటే ప్రజలు అనారోగ్యం బారిన పడతారని అన్నారు. ఈమేరకు నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, కలెక్టర్ చర్యలు చేపట్టాలన్నారు. ఎల్ఎండీలో రోజురోజుకు తగ్గుతున్న నీటి నిలువలతో నగరంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఎస్ఆర్ఎస్‌పీ నుంచి నాలుగు టీఎంసీల నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా నగరంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల వంటి అభివృద్ధి చేయకున్నా కనీసం తాగునీటిని కూడా సరఫరా చేయక పోవడం దుర్మార్గమని మండిపడ్డారు. నగర ప్రజలను తాగునీటి ఇబ్బందులకు గురిచేయాలని కుట్ర చేస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని, పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు దుర్శేటి అనూప్, చంద్రమౌళి, కొలిపాలక శ్రీనివాస్, కొలగాని శ్రీనివాస్, వంగల పవన్‌కుమార్, కటకం లోకేష్, కల్యాణచంద్ర, మొండయ్య, అనిల్, ఉయ్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది నుంచి సన్న బియ్యం

(5వ పేజీ తరువాయి)

సరఫరా చేస్తున్నారు. ఒకే దేశం ఒకే కార్డు విధానం కింద దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు కూడా ఎక్కడ ఉంటే అక్కడే బియ్యం తీసుకోవడానికి వీలుకలుగుతున్నది. జిల్లాలో మన రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన వారే కాకుండా ఏపీ, గుజరాత్, హర్యానా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారు వివిధ వృత్తుల్లో పనిచేస్తున్నారు. వారంతా ఆయా రాష్ట్రాలలో పొందిన రేషన్‌కార్డుల ద్వారా అలాగే కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే ఉంటూ ఇక్కడి రేషన్‌కార్డులు పొంది ఇక్కడ రేషన్‌బియ్యం తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు దొడ్డుబియ్యం పంపిణీ చేయడంతో చాలా మంది ఆ బియ్యాన్ని మార్కెట్‌లో విక్రయిస్తున్నారనే కారణంతో సన్నబియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో సన్నబియ్యం పంపిణీతో రేషన్‌కార్డులు కలిగి ఉన్నవారందరికీ ప్రయోజనం కలుగనున్నది. అయితే చాలా ఏళ్లుగా కొత్త రేషన్‌కార్డులు జారీ చేయక పోవడంతో వారికి సన్నబియ్యం పొందే అవకాశం లేకుండా పోయింది. సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వం ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసిన వారందరికీ కొత్తగా రేషన్‌కార్డులు జారీ చేసి సన్నబియ్యం అందించాలని కోరుతున్నారు.

## వ్యాస రచన పోటీల్లో వింధ్యావ్యాలీ విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంత్

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మెహర్ నగర్ వింధ్యావాలీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన హార్ట్‌ఫుల్‌నెస్ వ్యాసరచ నపోటీల్లో పతకాలు సాధించారు. శ్రీరామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నెస్ ఎడ్యుకేషన్ ట్రస్టు హైదరాబాద్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాశ్ రావు, వైస్ చైర్మన్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ అభినందించారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌తోపాటు రూరల్‌ని వివిధ ప్రాంతాల్లో చేపట్టనున్న మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ టూ, రూరల్ ఏడీఈలు, లావణ్య, రఘు ప్రకటనలో తెలిపారు. బీరప్ప కమాన్ ఏరియా, కోటయాశ్వద పారిశ్రామిక ప్రాంతం, వెంకటేశ్వర కమాన్, ఉదయం 8 గంటల నుంచి 11:30 వరకు ఎలగందల్, ఆసీఫ్ నగర్, బావుపేట్ గ్రానైట్ పరిశ్రమల ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

### గంగిపల్లి వాస్తవ్యుడికి డాక్టరేట్

గణేశ్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగంలో యాంటీ క్యాన్సర్ ఏజెంట్స్ పైన పరిశోధనకు మానకొండూరు మండలం గంగిపల్లికి చెందిన కుడికాల సదానందం అందుకున్నారు. శుక్రవారం ఎస్‌యూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ సురేష్ కుమార్ డాక్టరేట్ ప్రదానం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సరసిజా పర్యవేక్షణలో 'సర్చ్ ఫర్ యాంటీ క్యాన్సర్ ఏజెంట్స్, గ్రీన్ సింథసిస్ ఆఫ్ హెటిరోసైక్లిక్ కాంపౌండ్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. సదానందం ఇటీవల గురుకుల జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించారు.



సదానందం

**కామర్స్ విభాగంలో బైరి శ్రీనివాస్‌కు**

శాతవాహన విశ్వవిద్యాలయంలో కామర్స్ విభాగంలో పరిశోధక విద్యార్థి బైరి శ్రీనివాస్ డాక్టరేట్ అందుకున్నారు. 'కన్స్యూమర్ బిహేవియర్ టు వర్డ్స్ ఆన్‌లైన్ మార్కెటింగ్, స్టడీ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై శ్రీనివాస్ పరిశోధన చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## దక్షిణ భారత్‌పై నిర్ధారణ చేయాలి

సుభాష్‌నగర్ మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్‌పై పార్లమెంట్‌లో చర్చ ప్రారంభించిందని, ముందుగా దక్షిణ భారతం ఎక్కడి నుంచి ఎక్కడికనే దాన్ని నిర్ధారణ చేయాలని ప్రజామిత్ర ప్రోగ్రెసీవ్ డెమాక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం నగరంలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చారిత్రక, భౌగోళిక అంశాలను పరిశీలిస్తే మధ్య ప్రదేశ్ రాష్ట్రంలో వింధ్యా పర్వతాల దిగువన నుంచి హిందూ మహాసముద్రం వరకు విస్తరించి ఉన్న భూభాగాన్ని దక్షిణ భారతంగా పరిగణించే వారని తెలిపారు. మనం అనుకుంటున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళతోపాటు మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్‌లోని కొంత ప్రాంతం, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా రాష్ట్రాల్లో 70శాతం, భూ భాగాన్ని దక్షిణ భారతంగా పరిగణించాల్సి వస్తుందన్నారు. అంబేద్కర్ రాసిన స్టేట్స్ అండ్ మైనారిటీస్ అనే గ్రంథంలో దక్షిణ భారతంపై ఉత్తరాది పెత్తనం ఉండ కూడదనే అంశంపై సూచనలు చేశారని తెలిపారు. ఏప్రిల్ చివరిలో హైదరాబాద్‌లో 'దక్షిణ భారతదేశం' అంటే అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తామన్నారు.

# లక్ష్యం దాటిన ఉపాధి పని దినాలు

- **పనులకు హాజరైన 3,533 కుటుంబాలు**

కరీంనగర్ రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో ఉపాధి హామీ పనిదినాలు లక్ష్యం దాటాయి. గత సంవత్సరం కంటే ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనిరోజులు రెండు వారాల గడువు ఉండగానే లక్ష్యం దాటింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో మండలంలో 1,70,466 పనిదినాలు మంజూరు తీసుకున్నారు. కానీ అంతకు మించి కూలీలు పనులకు రావడంతో మొత్తం 1,72,350 పనిదినాలు పూర్తి చేసుకున్నారు. ఆర్థిక సంవత్సరంలో మండలంలో కూలీ పనులకు హజరైన కుటుంబాలు 3,533 మంది ఉండగా 100 రోజులు పూర్తి చేసిన కుటుంబాలు 368, ప్రస్తుతం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

14 గ్రామాలలో రోజు వారీగా 630 మంది కూలీలు హాజరవుతున్నారు. సగటున 45 మంది పనులు చేస్తున్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్ ఇటీవల నగునూర్‌లో ఉపాధి పనులను తనిఖీ చేశారు. లక్ష్యం దాటిన సందర్భంగా అదనంగా పనిదినాలు కల్పించనున్నట్లు ఏపీఓ శోభారాణి తెలిపారు.

## 31 నుంచి శ్రీరామ కథా రసామృతం

కరీంనగర్ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి సందర్భంగా నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా సమీపంలోని రాధా గోవిందుల బాలాలయంలో ఇస్కాన్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ నుంచి ఏప్రిల్ 6 వరకు శ్రీరామ కథా రసామృతం పేరుతో శ్రీమద్రామాయణ ప్రవచనం నిర్వహించనున్నట్లు నరహరి దాస్ ప్రభు తెలిపారు. శుక్రవారం ఆలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతీ రోజూ సాయంత్రం 5-30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఇస్కాన్ మందిర నిర్మాణానికి ప్రభుత్వం మూడు ఎకరాల స్థలం కేటాయించడం శుభపరిణామమని, దాదాపు 50 కోట్ల వ్యయంతో అందమైన రాధా గోవిందుల మందిరం నిర్మితమవుతుందని అన్నారు. కరీంనగర్ ఇస్కాన్ భక్త కమిటీ అధ్యక్షుడు కన్న కృష్ణ, డాక్టర్ రాజభాస్కరరెడ్డి, డాక్టర్ మధుసూదనరెడ్డి, రమేశ్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, వెంకటేశం, రాధాకిషన్ పాల్గొన్నారు.

## ● సంక్షిప్తంగా

**భగత్‌నగర్:** ఈ నెలలో పదవీ విరమణ పొందనున్న ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్ ఎం.చంద్రయ్యను జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్, ఆర్టీసీ అధికారులు శుక్రవారం సన్మానించారు. డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ విలాస్‌రెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.

● ఆర్టీసీ జోనల్ ఆసుపత్రిలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ గిరిసింహారావు ఆధ్వర్యంలో చంద్రయ్యను సత్కరించారు.

**సుభాష్ నగర్:** వాసవి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ట్రస్టీ మెంబర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన గంజి స్వరాజ్‌బాబును నియమించారు.

**గంగాధర:** పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం తీవ్ర బాధాకరమని ఏబసీసీ జిల్లా అధ్యక్షుడు ప్యాట యాది ప్రకాశ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గంగాధరలో మాట్లాడారు. ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

**కరీంనగర్ రూరల్:** కరీంనగర్ మండలం నగునూర్ శివారులోని దుర్గాభవానీ ఆలయంలో శనివారం నుంచి ఏప్రిల్ 6 వరకు వసంత నవరాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగల లక్ష్మణ్ తెలిపారు.

## ఘనంగా అల్విదా జుమ్మా ప్రార్థనలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసంలో చివరి శుక్రవారం సందర్భంగా నగ రంలోని మజీద్‌లలో, ఇళ్లలో ముస్లింలు అల్విదా జుమ్మా (జుమాతుల్ విదా) ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. మత పెద్దల ప్రసంగాలను విన్నారు. పవిత్ర ఖురాన్ పఠనంతో పాటు దాన ధర్మాదులు ఆచరించారు. బంధువులకు, మిత్రులకు, సన్నిహితులకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేశారు.



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

## యువతే దేశానికి విలువైన సంపద

కరీంనగర్ రూరల్; మార్చి28(ఆంధ్రజ్యోతి): యువతే దేశానికి విలువైన సంపదని తాజా మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లిలో జాతీయ సేవా పథకంలో భాగంగా శుక్రవారం సంవేదన2 అంతర్జాతీయ రక్తదాన మహోత్సవ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు. సుకదేవ్ స్ఫూర్తితో ముందుకుసాగాలన్నారు. ప్రత్యేక శిబిరాలు సమాజానికి ఎంతో దోహదపడుతాయన్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ టూ త్రీ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎలిజిబెత్, పడాల తిరుపతి, శ్రీనివాస్, డాక్టర్ ఉషాఖండల్, నీఫా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గొల్లె తిరుపతి పాల్గొన్నారు.

## పండుగలను స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవాలి: ఏసీపీ



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాబోయే పండుగలను కులమతాలకు అతీతంగా స్నేహపూర్వకమైన వాతావరణంలో జరుపుకోవాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో పీస్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రాబోయే ఉగాది, రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి పండుగలు ప్రజలంతా కలిసిమెలిసి జరుపుకోవాలన్నారు. ప్రజలకు పోలీసుల సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. సమావేశంలో టౌన్‌సీఐ తిరుమల్ గౌడ్, పీస్‌కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సైదాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ అభియాన్ నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ మండలంలోని ప్రతిగ్రామంలో పాదయాత్రలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, నాదెండ్ల రాజ్‌కుమార్, వేముల సాయికుమార్, గుండారపు శ్రీనివాస్, క్రిష్టయ్య, రవీందర్, మల్లారెడ్డి, రాజు, విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రూ.7230 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7230పలికింది. శుక్రవారం మార్కెట్‌యార్డుకు నలుగురు రైతులు 93క్వింటాళ్లు విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7230, కనిష్ఠ ధర రూ.7వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

### కార్మికులకు రెన్యూవల్ లైసెన్స్‌ల అందజేత

జమ్మికుంట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న హమాలీ, దడ్వాయి కార్మికులకు రెన్యూవల్ లైసెన్స్‌లను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌కార్యదర్శి ఆర్ మల్లేశం, ద్వితీయశ్రేణి కార్యదర్శి ఎన్ రాజా, అడ్తీదారుల సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, కార్మికులు పాల్గొన్నారు.

### రుణాలు సకాలంలో చెల్లించాలి

చిగురుమామిడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల నుంచి రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘాల అభివృద్ధికి కృషి చేయ్యలని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్, సింగిల్‌విండో చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, జంగ వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అర్ధవార్షిక మహాసభ చైర్మన్ వెంకటరమణారెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో సీఈవో కాటం నర్సయ్య, సంఘండైరెక్టర్లు చిట్టుమల్ల శ్రీనివాస్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

# అన్నివర్గాల ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటాను

చొప్పదండి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం చొప్పదండిలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ, ముస్లింలు సోదరభావంతో కలిసిమెలిసి ఒకే కుటుంబ సభ్యుల్లా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, ముస్లిం మతపెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చొప్పదండిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





ఇల్లందకుంటలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు, అధికారులు

**రామడుగు:** మండలకేంద్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్‌విందులో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఏఎంసీచైర్‌పర్సన్ బొమ్మరపెల్లి తిరుమల, మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు కర్రసత్యప్రసన్న, ముస్లింపెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

**వీణవంక:** మండలంలోని చల్లూరులోని ప్రభుత్వం తరుపున ఇచ్చిన ఇఫ్తార్ విందులో తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్,ఎంపీడీవో మేరుగుశ్రీధర్,ముస్లిం మతపెద్దలు ఎండి అఖీల్,మునీరొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

**జమ్మికుంట రూరల్:** మున్సిపల్‌పరిధిలోని కొత్తపల్లిలో కాంగ్రెస్‌పార్టీనాయకులు, ఇల్లందకుంట దేవస్థానం మాజీచైర్మన్ దేశినికోటి ముస్లింలకు శుక్రవారం ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్ విందు స్వీకరించారు.

**ఇల్లందకుంట:** మండలంకేంద్రంలో ప్రభుత్వం తరుపున తహసీల్దార్ పోలేపాక రాణి ఆధ్వర్యంలో ముస్లింలకు శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. డిప్యూటీతహసీల్దార్ మనమిత్‌సింగ్, గిర్దావర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

చొప్పదండి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని రూరల్ ఏసీపీ శుభంప్రకాశ్ అన్నారు. శుక్రవారం నవోదయ విద్యాలయంలో స్పోర్ట్స్, కల్చరల్‌ఫెస్ట్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు చదువుతోపాటుక్రీడల్లో పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా విజేతలకు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో సీఐలు ప్రకాశ్‌గౌడ్, సురేందర్, ప్రిన్సిపాల్ మంగతాయారు, వైస్‌ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సభ్యులకు పదిశాతం డివిడెండ్

చొప్పదండి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సభ్యులకు వాటా ధనంపై పదిశాతం డివిడెండ్‌ను ఇస్తున్నట్లు చొప్పదండి వ్యవసాయ సహకార సంఘం ప్రత్యేక అధికారి లక్ష్మణాచారి తెలిపారు. శుక్రవారం సంఘం 74వ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చొప్పదండి సంఘం రాష్ట్రంలోనే కాకుండా దేశంలో మంచి పేరు సంపాదించుకుందని, దీని అభివృద్ధికి విశేష కృషి చేసిన పాలకవర్గాలు, రైతులు, సిబ్బందిని ఆయన అభినందించారు. సంఘం సిబ్బందికి ఒకనెల జీతం బోనస్‌గా ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

### మండల ప్రత్యేకాధికారిగా రజినీకాంత్

చిగురుమామిడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా సివిల్ సప్లయ డీఎం రజినీకాంత్‌కు జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం బాధ్యతలు ఇచ్చినట్లు శుక్రవారం జిల్లా పరిషత్ సీఈవో మొగిళి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

## కాంగ్రెస్‌తోనే రాజ్యాంగ పరిరక్షణ: వొడితెల ప్రణవ్

జమ్మికుంట/వీణవంక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే రాజ్యాంగ పరిరక్షణ సాధ్యం అని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ వొడితెల ప్రణవ్ అన్నారు. శుక్రవారం జమ్మికుంట, వీణవంకలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ మండల స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రణవ్‌బాబు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ అవమానపరిస్తే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను స్మరించుకుంటూ రాజ్యాంగాన్ని రక్షించుకునేది కాంగ్రెస్ పార్టీ అన్నారు. కార్యక్రమంలో సుంకరి రమేష్, పర్శరామరావు, దేశిని కోటి, పొనగంటి మల్లయ్య, సాయిని రవి, మొలుగూరి సదయ్య, పుల్లూరి సదానందం, సతీష్‌రెడ్డి, కటంగూరి శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





వీణవంకలో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

### నవోదయ ఫలితాలలో అక్షర విద్యార్థినుల సత్తా

రామడుగు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం (2025-26)కి గాను జాతీయస్థాయిలో నిర్వహించిన నవోదయ ఎంట్రెన్స్ ఫలితాల్లో గోపాల్‌రావుపేట అక్షర హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు ర్యాంకులు సాధించి సత్తాచాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు.

### నైపుణ్యాలు అలవర్చుకుంటేనే వికసిత భారత్

హుజూరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సాంప్రదాయ విజ్ఞానాన్ని నేర్చుకుంటూనే ఆధునిక నైపుణ్యాలు అలవర్చుకున్నప్పుడే వికసిత భారతదేశం ఆవిష్కరితమవుతుందని ఎన్ఐటీ వరంగల్ ఆచార్యులు ఆనంద్‌కిశోర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో వికసిత్‌భారత్ 2047విద్యావిధానం, భారతీయ జ్ఞానపరంపర ఏకీకరణ ఆవిష్కరణలు, వ్యవస్థాపకత అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయసదస్సు ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీనవిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధితోనే వికసితభారత్ సాధ్యమన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, లింగారెడ్డి, మహిపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రేణుక, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

### కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

చొప్పదండి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి క్యాంపుకార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం మండలంలోని 81మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు.

### దివ్యాంగ పిల్లల భత్యాలు విడుదల

తిమ్మాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాపాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో మండలంలోని దివ్యాంగ పిల్లలకు వివిధరకాల భత్యాలను విడుదల చేసినట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈభత్యాలు 8నెలలకు సంబంధించి 76,920 రూపాయలు పిల్లల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలోకి విడుదల చేసినట్లు తెలిపారు.

### ముగిసిన భాగవత సప్తాహం

మానకొండూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లిలో ఈనెల 21నుంచి జరుగుతున్న శ్రీమద్ భాగవత సప్తాహ మహోత్సవం శుక్రవారం ముగిసింది. ఈసందర్భంగా శ్రీమాన్ నంబి వేణుగోపాలచారి మాట్లాడుతూ పరమాత్ముని ఆరాధనతో ప్రశాంతగా ఉండవచ్చన్నారు

### ముస్లింలకు రేషన్ కిట్లు

హుజూరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిటీసెంట్రల్ హాల్‌లో శుక్రవారం జామేమసీద్ ఈద్గా ఖబ్రిస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్‌హుస్సేన్ 100 మంది ముస్లింలకు రేషన్ కిట్లను పంపిణీ చేశారు.

### మాజీమంత్రులు క్షమాపణ చెప్పాలి

హుజూరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్లను అవమానపరిచిన మాజీమంత్రులు హరీష్‌రావు, ప్రశాంత్ రెడ్డికి వ్యతిరేకంగా శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద ట్రాన్స్‌జెండర్లు నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాజీమంత్రులు వెంటనేక్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### సన్మానం

చిగురుమామిడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను శుక్రవారం హైదరాబాద్‌లో మండలా నికిచెందిన కాంగ్రెస్‌దళితసంఘం నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

### సన్నాహక సమావేశం ఏర్పాటు

చొప్పదండి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ పరిరక్షణకై నిర్వహించే జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ యాత్రకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని శుక్రవారం చొప్పదండిలో నిర్వహించారు.